క్లుప్తంగా

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నల్లజర్ల: తెలికిచెర్ల విద్యుత్ సబ్ స్టేషన్ టౌన్ ఫీడర్ పరిధిలో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ గృహ, వాణిజ్య అవసరాలకు కరెంట్ సరఫరాను నిలుపుదల చేస్తామని ట్రాన్స్‌కో ఈఈ నారాయణ అప్పారావు బుధవారం తెలిపారు. చెట్ల కొమ్మల తొలగింపు, లైన్ల మరమ్మతుల నిమిత్తం సరఫరాను నిలుపుదల చేస్తున్నామన్నారు.

బీజేపీ కొవ్వూరు శాఖ అధ్యక్షుడిగా సందీప్


సందీప్‌కుమార్‌ను సత్కరిస్తున్న బీజేపీ నాయకులు

కొవ్వూరు: బీజేపీ పట్టణశాఖ అధ్యక్షుడిగా సలాది సందీప్‌కుమార్ నియమితులయ్యారు. పట్టణంలోని పరిమి రామారాయుడు, రత్తమ్మ కల్యాణ మండపంలో బుధవారం ఆ పార్టీ పట్టణ శాఖ సమావేశం నిర్వహించారు. పార్టీ తరఫున నియమితులైన ఎన్నికల అధికారి అనురాధ నూతన అధ్యక్షుడిగా సందీప్‌కుమార్‌ను ఏకగ్రీవంగా ప్రకటించారు. నాయకులు సందీప్‌ను ఘనంగా సత్కరించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పరిమి రాధాకృష్ణ, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పిల్లలమర్రి మురళీకృష్ణ, రాష్ట్ర కిసాన్‌మోర్చా ఉపాధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, అసెంబ్లీ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ మట్లా ఆంజనేయులు, కో-కన్వీనర్ టీవీ ముత్యాలరావు, తురగా ఉదయ్‌భాస్కర్, కొత్తూరి రవితేజ పాల్గొన్నారు.

ఉండ్రాజవరం మండల శాఖ అధ్యక్షుడిగా కొప్పినీడి


ఉండ్రాజవరం మండల శాఖ అధ్యక్షుడు సత్యనారాయణతో బీజేపీ నేతలు

ఉండ్రాజవరం: బీజేపీ మండలశాఖ నూతన అధ్యక్షుడిగా కొప్పినీడి సత్యనారాయణ, మండల అధికార ప్రతినిధిగా బూరుగుపల్లి శివరామకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉండ్రాజవరంలో బుధవారం నిర్వహించిన ఆ పార్టీ మండలశాఖ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు, సభ్యులు, బూత్ కమిటీల అధ్యక్షులు, కార్యకర్తల సమక్షంలో ఈ ఎన్నిక నిర్వహించారు. ఎన్నికల అధికారిగా బీజేపీ రాజమహేంద్రవరం పార్లమెంటరీ కన్వీనర్ పడాల నాగరాజు వ్యవహరించారు.

పదికి ప్రత్యేక బోధన


కోరుమామిడి జెడ్పీ హైస్కూల్లో టెన్త్ విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతి


సమిశ్రగూడెం జెడ్పీ హైస్కూల్లో ప్రత్యేక తరగతిని పర్యవేక్షిస్తున్న ఎంఈఓ గురుమూర్తి

- ప్రభుత్వ పాఠశాలల్లో స్టడీ అవర్స్ నిర్వహణ
- నూరు శాతం ఉత్తీర్ణత, వెనుకబడిన విద్యార్థులపై దృష్టి

నిడదవోలు రూరల్: పదో తరగతి అనేది ప్రతి విద్యార్థి భవిష్యత్తు దశ..దిశ.. నిర్దేశిస్తుంది. పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలనే కాంక్ష విద్యార్థుల్లోనే కాకుండా ఉపాధ్యాయుల్లోనూ బలంగా ఉంటోంది. దీనికి అనుగుణంగానే ప్రభుత్వ పాఠశాలల్లో కసరత్తు మొదలైంది. టెన్త్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మాత్రమే ట్రిపుల్ ఐటీ సీట్లు దక్కుతాయి. అలాగే ఎన్నో ప్రతిభా పురస్కారాలు లభిస్తాయి. ఇంటర్ ప్రవేశాల్లో ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు రాయితీలు కల్పిస్తాయి. ఈ నేపథ్యంలో టెన్త్‌లో మెరుగైన ఫలితాలు సాధించడమే లక్ష్యంగా విద్యాశాఖ వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక చేపట్టింది. ఈ మేరకు మార్గదర్శకాలు జారీ చేయడంతో రెండో శని, ఆదివారాల్లో సైతం పదో తరగతి విద్యార్థులకు అదనపు తరగతులు నిర్వహిస్తున్నారు. దానిని డిసెంబర్ 1 నుంచి అమలు చేస్తున్నారు. నియోజకవర్గంలోని నిడదవోలు, పెరవలి, ఉండ్రాజవరం మండల్లాలోని 38 ఉన్నత పాఠశాలలు,18 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో సుమారు 3,700 మంది విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు. ఈ ఏడాది మార్చి 17 నుంచి 31 వరకూ పబ్లిక్ పరీక్షలు జరగనున్నాయి.

ప్రత్యేక తరగతులు

పదోతరగతి పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేసేలా ప్రతి పాఠశాలలో 100 రోజుల ప్రణాళిక అమలు చేస్తున్నారు. రోజూ ఉదయం 8 నుంచి 9 గంటల వరకూ, సాయంత్రం 4 నుంచి 5.30 గంటల వరకూ ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. విద్యార్థులకు గత పరీక్షల్లో వచ్చిన మార్కుల ఆధారంగా వారిని బృందాలుగా విడదీశారు ఏ,బీ కేటగిరీ విద్యార్థులతో సమానంగా సీ,డీ గ్రేడుల్లో ఉన్నవారిని తీసుకొచ్చేలా ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. తరగతి గదిలో బోధించిన పాఠ్యాంశాల పునశ్చరణ (రివిజన్) చేయిస్తున్నారు. విద్యార్థులకు అర్థం కాని అంశాలను బోధిస్తూ సందేహాలు నివృత్తి చేస్తున్నారు. క్లిష్టమైన సబ్జెక్టులపై భయం లేకుండా పరీక్ష రాసే విధానాన్ని వివరిస్తున్నారు. పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులంతా ప్రతిఒక్కరూ నలుగురు నుంచి 6 మంది విద్యార్థులను దత్తత తీసుకున్నారు. దత్తత తీసుకున్నవారు ఎలా చదువుతున్నారు? ఏ సబ్జెక్టులో వెనుకబడి ఉన్నారు? వారిలో భయాన్ని పోగొట్టి ఆత్మవిశ్వాసం నింపేలా కృషి చేస్తున్నారు.

మరోసారి విజయ ఢంకా



విద్యార్థులకు 100 రోజుల ప్రణాళిక సిద్ధం చేసి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. సీ,డీ గ్రేడుల్లో ఉన్న విద్యార్థులు కూడా సులభంగా మంచి మార్కులు సాధించేలా కృషి చేస్తున్నాం. ఉదయం 8 గంటలకు వచ్చిన విద్యార్థులు సాయంత్రం 5.30 గంటలకు తిరిగి ఇంటికి వెళ్తారు. నూరు శాతం ఉత్తీర్ణత సాధించి మరోసారి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు విజయఢంకా మోగిస్తారు.

– పి.గురుమూర్తి, ఎంఈఓ-2, నిడదవోలు

స్టడీ అవర్స్‌తో ఉపయోగం



ఉదయం, సాయంత్రం పూట నిర్వహిస్తున్న స్టడీ అవర్స్ ఉపయోగకరంగా ఉన్నాయి. ప్రతి అంశాన్ని ఉపాధ్యాయుల నుంచి నేర్చుకుంటున్నాం. ఇప్పటికే సిలబస్ పూర్తయింది. రివిజన్ చేసుకుంటున్నాం. ఆయా సబ్జెక్టులను ప్రత్యేకంగా బోధించడంతో పరీక్షలంటే భయం పోయింది. పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులు తెచ్చుకుంటాం.

– లక్ష్మీప్రసన్న, విద్యార్థిని, సమిశ్రగూడెం

సబ్జెక్టుపై భయం పోయేలా..



తరగతి గదిలో వచ్చిన సందేహాలను సాయంత్రం ప్రత్యేక తరగతుల్లో నివృత్తి చేసుకుంటున్నాం. ప్రభుత్వం నిర్వహించే పరీక్షలతో పాటు ఉపాధ్యాయులు పరీక్షలు పెడుతున్నారు. తరచూ పరీక్షలు రాయడం వల్ల అన్ని విషయాలూ జ్ఞాపకం ఉంటున్నాయి. టీచర్ల ప్రోత్సాహం బాగుంది. మార్చిలో జరిగే పబ్లిక్ పరీక్షల్లో 550 మార్కులకు పైగా సాధించేలా ప్రణాళికా బద్ధంగా చదువుతున్నా.

– కొమ్మిన సుప్రజ, విద్యార్థిని, సమిశ్రగూడెం

5 నుంచి కాకినాడలో యూటీఎఫ్ స్వర్ణోత్సవాలు

నల్లజర్ల: ఈనెల 5,6,7,8 తేదీల్లో కాకినాడలోని పీఆర్ కళాశాల మైదానంలో నిర్వహించే యూటీఎఫ్ స్వర్ణోత్సవాలను జయప్రదం చేయాలని ఆ సంస్థ జిల్లా కార్యదర్శి సీహెచ్ఎస్ మనోహరకుమార్ కోరారు. బుధవారం నల్లజర్ల నంబర్-2 పాఠశాలలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం మారినప్పటికీ పాఠశాలల్లో యాప్‌ల విధానం మాత్రం మారలేదన్నారు. ఉపాధ్యాయుల బోధనకు ఈ యాప్‌లు ఆటంకంగా ఉన్నాయన్నారు. డీఏ, పీఆర్‌సీ బకాయిలు వెంటనే చెల్లించాలని, ప్రమోషన్లు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైస్కూలు ప్లస్ విధానాన్ని కొనసాగించాలని,117 జీఓ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 3,4,5 తరగతులను ప్రాథమిక పాఠశాలల్లోనే ఉంచాలన్నారు. సమావేశంలో యూటీఎఫ్ మండల శాఖ గౌరవాధ్యక్షుడు పల్లి వెంకటఅప్పారావు, ప్రధాన కార్యదర్శి బండి కిశోర్, అసోసియేట్ కార్యదర్శి టి.నాగేశ్వరరావు, ఆడిటర్ శెనగన రాంబాబు, కార్యదర్శి హేమంత్ కుమార్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

దేవరపల్లి: మండలంలోని యర్నగూడెం బస్టాండ్ సెంటర్లో బుధవారం సాయంత్రం రోడ్డు ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు. రాజమహేంద్రవరం నుంచి నల్లజర్ల మండలం అనంతపల్లి వెళుతున్న బైక్‌ను ట్రాక్టర్ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న ముగ్గురు వ్యక్తులూ గాయపడ్డారు. వారిలో వృద్ధురాలికి తీవ్ర గాయాలు కాగా 108 అంబులెన్స్‌లో పోలీసులు గోపాలపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

రాష్ట్రాభివృద్ధికి కలసికట్టుగా పని చేద్దాం

నిడదవోలు: కొత్త సంవత్సరంలో రాష్ట్రాభివృద్ధి కోసం కలసికట్టుగా పని చేద్దామని అధికారులు, కూటమినేతలు, కార్యకర్తలకు రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ కోరారు. పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన న్యూ ఇయర్ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు శాఖల ప్రభుత్వాధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, సిబ్బంది మంత్రి దుర్గేష్‌కు పుష్పగుచ్ఛాలు అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వివిధ న్యూ ఇయర్ క్యాలెండర్లను మంత్రి ఆవిష్కరించారు. మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, కమిషనర్ టి. కృష్ణవేణి, నిడదవోలు సీఐ పీవీజీ తిలక్, పట్టణ ఎస్సై శోభన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: స్థానిక బూరుగుపల్లి సుబ్బారావు నివాసంలో ఆయనకు ఏపీ సీడ్స్ కార్పొరేషన్ మాజీ డైరక్టర్ బూరుగుపల్లి చిన్న కృష్ణమూర్తిలకు గ్రామ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి శుభాకాంక్షలు తెలిపారు. మండల పరిషత్ కార్యాయలంలో ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి శరత్‌లకు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు బొకేలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

ఎవరి గ్రూపు సంబరం వారిదే


టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన నూతన సంవత్సర వేడుకల్లో ఎమ్మెల్యే వెంకటేశ్వరరావు


కొవ్వూరులోని తన ఇంటి వద్ద నూతన సంవత్సర కేక్ కట్ చేస్తున్న కేఎస్ జవహర్, ఆయన వర్గీయులు

- కొవ్వూరు నియోజకవర్గ టీడీపీలో కొనసాగుతున్న గ్రూపుల గోల
- వేర్వేరుగానే న్యూ ఇయర్ వేడుకల నిర్వహణ

కొవ్వూరు: కొవ్వూరు టీడీపీలో విభేదాలు కొనసాగుతున్న నేపథ్యంలో రెండు గ్రూపుల నాయకులు బుధవారం వేర్వేరుగా నూతన సంవత్సర వేడుకలు జరుపుకున్నారు. పట్టణ టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, టీడీపీ ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బారాయచౌదరి, కంఠమణి రామకృష్ణ ఆధ్వర్యంలో న్యూ ఇయర్ వేడుకలు నిర్వహించారు. మాజీ మంత్రి, పార్టీ జిల్లా అధ్యక్షుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్ తన వర్గీయులతో కలిసి స్థానిక నందమూరు రోడ్డులోని తన స్వగృహంలో నూతన సంవత్సర సంబరాలు జరుపుకున్నారు. టీడీపీలో ఎవరి గ్రూపు నాయకులు, కార్యకర్తలు వారివారి శిబిరాలకు వెళ్లి తమ అభిమాన నేతలకు శుభాకాంక్షలు తెలిపారు.2025 కొత్త సంవత్సరంలోనూ టీడీపీలో గ్రూపుగోల పోలేదు. రెండు గ్రూపుల నాయకులు తమ మద్దతుదారులతో కలిసి కేక్‌లు కట్ చేసుకుని, పుష్పగుచ్ఛాలు అందజేసుకుని సంబరాలు చేసుకున్నారు.అధికార టీడీపీలో గ్రూపు తగదాలు కొత్త సంవత్సరంలోను సమసి పోకపోవడం కార్యకర్తలకు మింగుడు పడడం లేదు. ఇటీవల టీడీపీలో చేరిన ఎస్.రాజీవ్‌కృష్ణ కొవ్వూరులో ప్రత్యేకంగా కార్యాలయం నిర్వహిస్తున్నప్పటికీ న్యూఇయర్ వేడుకలకు దూరంగా ఉన్నారు.

నిర్మలగిరిలో పేదలకు దుప్పట్లు, చీరల పంపిణీ


నిర్మలగిరిలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న డైరెక్టర్ జాన్ పీటర్, కాంట్రాక్టర్ నాగేశ్వరరావు


వేళ్లచింతలగూడెంలో పేదలకు దుప్పట్లు, చీరలు పంపిణీ చేస్తున్న మానవత సంస్థ సభ్యులు

దేవరపల్లి: నూతన సంవత్సర వేడుకలను గౌరీపట్నంలోని నిర్మలగిరి మేరీమాత పుణ్యక్షేత్రంలో బుధవారం సాయంత్రం డైరెక్టర్ రెవరెండ్ ఫాదర్ ఎస్.జాన్‌పీటర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన కేక్ కట్ చేశారు. క్షేత్రంలోని నిత్యాన్నదాన పథకం ట్రస్ట్ కాంట్రాక్టర్ కర్రి నాగేశ్వరరావు ఫాదర్లు, సిస్టర్లను ఘనంగా సన్మానించి స్వీట్లు అందజేశారు. క్షేత్రంలోని వృద్ధాశ్రమంలోని వృద్ధులకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. సుమారు 200 మంది పేదలకు దుప్పట్లు, చీరలు, స్వీట్లు ఫాదర్ జాన్‌పీటర్, కర్రి నాగేశ్వరరావు అందజేశారు.

మానవత సంస్థ ఆధ్వర్యంలో..

గోపాలపురం: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ మండల శాఖ ఆధ్వర్యంలో బుధవారం వేళ్లచింతలగూడెంలో సుమారు 100 మంది నిరు పేదలకు దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు. తమ సంస్థ వ్యవస్థాపకుడు రామచంద్రారెడ్డి ఆశయాలకు అనుగుణంగా సంస్థ సభ్యులు పని చేస్తున్నట్టు ఆ సంస్థ మండల శాఖ అధ్యక్షుడు పప్పు సత్యకృష్ణారెడ్డి ఈ సందర్భంగా అన్నారు. కార్యక్రమంలో ఆ సంస్థ చైర్మన్ జొన్నలగడ్డ రాంబాబు, నెల్లి చంద్రశేఖర్, గెడ జోగేంద్రప్రసాద్, కె.కీర్తికుమార్, కె నాగరాజు, జొన్నలగడ్డ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఎక్కడ చూసినా న్యూ ఇయర్ సందడి

- కేక్‌లు కట్ చేసిన వైఎస్సార్ సీపీ కో-ఆర్డినేటర్లు
- శుభాకాంక్షలు తెలిపిన పార్టీ శ్రేణులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు
- సందడిగా సాగిన పార్టీ కార్యాలయాలు


యర్నగూడెంలోని క్యాంపు ఆఫీసు వద్ద కేక్ కట్ చేస్తున్న మాజీ మంత్రి తానేటి వనిత


కొవ్వూరు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో కేక్ చేస్తున్న పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలారి వెంకట్రావు


నిడదవోలులో మాజీ ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడికి శుభాకాంక్షలు చెబుతున్న నాయకులు, కార్యకర్తలు

దేవరపల్లి: నూతన సంవత్సర వేడుకలను వివిధ వర్గాల ప్రజలు బుధవారం ఘనంగా జరుపుకున్నారు. మంగళవారం అర్ధరాత్రి 12 గంటల నంచి భారీఎత్తున బాణసంచా కాల్చి, కేక్‌లు కట్ చేశారు. మహిళలు ఇంటి ముంగిట రంగవల్లులను తీర్చిదిద్దారు. ప్రభుత్వ కార్యాలయాలు, అధికారులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకుల ఇళ్ల వద్ద సందడిగా వేడుకలు నిర్వహించారు. యర్నగూడెంలోని క్యాంపు కార్యాలయం వద్ద మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ గోపాలపురం నియోజకవర్గ సమన్వయకర్త తానేటి వనిత న్యూ ఇయర్ వేడుకలు నిర్వహించారు. ఆ పార్టీ నాయకులు, అధికారులు, నియోజకవర్గ ప్రజలు, అభిమానులు, కుటుంబ సభ్యుల సమక్షంలో వనిత కేక్ కట్ చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, పార్టీ శ్రేణులు పెద్దఎత్తున ఇక్కడకు చేరుకుని మాజీ మంత్రి వనితకు పుష్పగుచ్ఛాలు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలతో క్యాంపు కార్యాలయం కిక్కిరిసింది. వనిత పిలుపు మేరకు విద్యార్థులకు అవసరమైన నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, విద్యాసామగ్రి తీసుకువచ్చి ఆమెకు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే మండల పరిషత్ కార్యాలయాలు, గ్రామ సచివాలయాలు, సొసైటీ కార్యాలయాలు, విద్యాసంస్థల వద్ద నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. ఎంపీపీ కేవీకే దుర్గారావు, జెడ్పీటీసీ సభ్యురాలు పొట్టి స్వర్ణలత, పార్టీ మండలశాఖ అధ్యక్షుడు కూచిపూడి సతీష్ కేక్‌కట్ చేశారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి డి.సువర్ణరాజు ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడులు నిర్వహించారు.

కొవ్వూరు: నూతన సంవత్సర వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. పట్టణ వ్యాప్తంగా చర్చిల్లో మంగళవారం అర్ధరాత్రి వరకూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. న్యూ ఇయర్ సందర్భంగా పలువురు దేవాలయాలకు వెళ్లి మొక్కుకోగా, మరికొందరు చర్చిల్లో ప్రార్థనలు చేశారు. స్నేహితు లు,బంధువుల మధ్య కేక్‌లు కట్ చేసుకుని ఎక్కడికక్కడే సంబరాలు జరుపుకున్నారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలారి వెంకట్రావు ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో వెంకట్రావు కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా నాయకులు పుష్పగుచ్ఛాలు అందజేసి ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీపీలు జొన్నకూటి పోసిరాజు, మట్టా వీరాస్వామి, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోసిన శ్రీలేఖ, పార్టీ మండలశాఖ అధ్యక్షులు సుంకర సత్యనారాయణ, కాకర్ల వెంకటేశ్వరరావు, చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు, పార్టీ పట్టణశాఖ అధ్యక్షు డు రుత్తల భాస్కరరావు, నాయకులు ఉప్పులూరి సూరిబాబు, ఎస్సీ సెల్ రాష్ట్ర విభాగం నాయకులు పిట్టా శ్రీనివాస్, జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు తోట రామకృష్ణ, కంఠమణి రమేష్, బత్తి నాగరాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లభశెట్టి గంగాధర శ్రీనివాస్, పెద్దేవం సర్పంచ్ తిగిరిపల్లి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

అలాగే పట్టణంలో మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణకు పలువురు నాయకులు,కార్యకర్తలు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆర్డీవో రాణి సుస్మితకు డివిజన్ పరిధిలోని వివిధ శాఖల అధికారులు శుభాకాంక్షలు తెలిపారు. డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ జి.దేవకుమార్ కేక్ కట్ చేశారు. డివిజన్‌లోని పోలీసు అధికారులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.


కొవ్వూరులో కేక్ కట్ చేస్తున్న ఆర్డీవో రాణి సుస్మిత

నిడదవోలు: స్థానిక శాంతినగర్‌లోని వైఎస్సార్ సీపీ ప్రధాన కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడి ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గంలోని ఆ పార్టీ శ్రేణులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు శ్రీనివాస్ నాయుడికి పుష్పగుచ్ఛాలు, పండ్లు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన సంవత్సరంలో ప్రజలంతా సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలతో జీవించాలంటూ ఆకాంక్షించారు. నియోజకవర్గ ప్రజలకు ఆయన నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ యలగాడ బాలరాజు, ఎంపీపీలు కాకర్ల ప్రసాద్, తిరుమళ్ల భాగ్యలక్ష్మి, పాలాటి యల్లారీశ్వరి, జెడ్పీటీసీ సభ్యులు నందిగం భాస్కర రామయ్య, కొమ్మిశెట్టి రామాంజని, పార్టీ నిడదవోలు, పెరవలి మండల శాఖల అధ్యక్షులు అయినీడి పల్లారావు, వీరమళ్ల సత్యనారాయణలతో పాటు గాజుల రంగారావు, కామిశెట్టి సత్యనారాయణ, పువ్వల రతీదేవి, బూరుగుపల్లి సుబ్బారావు, పొట్టి రాంబాబు, ఎస్కే వజీరుద్దీన్, ముళ్లపూడి శ్రీహరి, పెన్మత్స చందు, కొత్తపల్లి సుప్రియ, గోపిరెడ్డి శ్రీనివాస్, గజ్జరపు రమేష్, ఆలమూరు భారతి పాల్గొన్నారు.

నిడదవోలు రూరల్: నూతన సంవత్సర వేడుకలను బుధవారం మండలంలో వాడవాడలా ఘనంగా జరుపుకున్నారు. ప్రతి ఇంటి ముంగిటా నూతన సంవత్సరానికి రంగవల్లులతో స్వాగతం పలికారు. స్నేహితులు, బంధువులు, ప్రేమికులు హృదయాలను హత్తుకునేలా ఒకరికొకరు గ్రీటింగ్ వాట్సప్, ఫేస్‌బుక్ ఎస్ఎంఎస్‌లు, పూలబొకేలతో నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకున్నారు. నిడదవోలులో మాజీ ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు ఆధ్వర్యంలో జరిగిన న్యూ ఇయర్ వేడుకలకు మండలంలోని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలి వెళ్లి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. వైఎస్సార్ సీపీ మండలశాఖ అధ్యక్షుడు అయినీడి పల్లారావు, ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి, మండల నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు. సమిశ్రగూడెం జీడీఎం ప్రార్థనా మందిరం వద్ద జరిగిన నూతన సంవత్సర వేడుకల్లో వైఎస్సార్ సీపీ గ్రామశాఖ అధ్యక్షుడు గజ్జరపు శ్రీరమేష్ కేక్ కట్ చేశారు. పలు క్రైస్తవ ప్రార్థన మందిరాల్లో నూతన సంవత్సర ఆరాధనలు నిర్వహించి ప్రేమవిందు ఏర్పాటు చేశారు.

పెరవలి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్‌కు వైఎస్సార్ సీపీ శ్రేణులు పూల బొకేలు, పండ్లు అందించి, కేక్ కట్ చేయించారు. అనంతరం ప్రసాద్ ఆధ్వర్యంలో నాయకులందరూ పెద్ద ఎత్తున నిడదవోలు తరలి వెళ్లి మాజీ ఎమ్మెల్యే జి. శ్రీనివాస్‌నాయుడికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మండలంలోని ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీల సర్పంచులు, కొమ్మిశెట్టి రాము, తోట సురేష్, అంబటి బ్రహ్మయ్య, మధు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

తాళ్లపూడి: ఎంపీపీ జొన్నకూటి పోశిరాజుకు, ఎంపీడీవో వెంకటరమణ, అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయ ఉద్యోగులు పూలబొకేలు, పండ్లు ఇచ్చి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అలాగే పలువురు జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోశిన శ్రీలేఖను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పెద్దేవంలో జరిగిన వేడుకల్లో సర్పంచ్ తిగిరిపల్లి వెంకటరావు, వైస్సార్ సీపీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు తోట రామకృష్ణ పాల్గొన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా మంగళవారం రాత్రి పలు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

చాగల్లు: బ్రాహ్మణగూడెంలోని పెంతుకోస్తు, బైబిల్ మిషన్, చాగల్లులోని జీడీఎం, నెలటూరు, ఊనగట్లలోని చర్చిల్లో విశ్వాసులు కొవ్వొత్తులు వెలిగించి కొత్త సంవత్సరానికి స్వాగతం పలికారు. యువత బాణసంచా కాల్చి నూతన సంవత్సరం వేళ సందడి చేసింది. చాలామంది బుధవారం ఉదయం ఆలయాలకు వెళ్లి పూజలు,అభిషేకాలు నిర్వహించారు. ఎంపీపీ మట్టా వీరాస్వామి, జెడ్పీటీసీ సభ్యురాలు గారపాటి విజయదుర్గ వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గంగ్రోతు సురేంద్రకుమార్, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు తదితరులు కేక్‌లు కట్ చేసి నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు.

గోపాలపురం: వాదాలకుంటలో సర్పంచ్ జొన్నకూటి మనెమ్మ ఆధ్వర్యంలో న్యూ ఇయర్ కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. ఎంపీపీ వుండవల్లి, సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు కాకులపాటి లలిత లను వారి గృహాల వద్ద అధికారులు, ప్రజాప్రతినిధులు కలసి శుభాకాంక్షలు తెలిపారు. వైఎస్సార్ సీపీ గోపాలపురం నాయకుడు కూసం రామమోహన్‌రెడ్డిని ఆయన ఇంటి వద్ద పలువురు ఆ పార్టీ స్థానిక నాయకులు కలసి శుభాకాంక్షలు తెలిపారు. ముల్లంగి శ్యామ్‌సుందర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, వింజమూరి సుబ్బారావు, ఎస్కె వల్లీ, వింత ప్రసాద్‌రెడ్డి, పార్టీ మండలశాఖ అధ్యక్షుడు పోతిరెడ్డి నాగరాజు, పోల్నాటి సురేష్ పాల్గొన్నారు.


తాడిమళ్లలో నిడదవోలు ఎంపీపీ భాగ్యలక్ష్మికి న్యూ ఇయర్ గ్రీటింగ్స్ చెబుతున్న కార్యాలయ సిబ్బంది


పెరవలిలో ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్‌కు పూలబొకే అందిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు


తాళ్లపూడి మండల పరిషత్ కార్యాలయంలో..


వైఎస్సార్‌సీపీ కొవ్వూరు ఇన్‌చార్జి వెంకట్రావుకు గ్రీటింగ్స్ చెబుతున్న చాగల్లు మండల నాయకులు